సాక్షి
అనంతపురం
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.47

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది. కనిష్టం రూ.37, సరాసరి రూ.27 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.7°/21.2°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మట్టి గణపతిని పూజించాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: వినాయక చతుర్థి సందర్భంగా మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిక్షించాలని ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'మట్టి ప్రతిమలను పూజించి– పర్యావరణాన్ని పరిరక్షించాలి' అనే పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకూడదన్నారు. జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గించడం లేదా పూర్తిగా మానేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఎఫ్ఎస్‌ఓ రామకృష్ణారెడ్డి, ఏపీ పీసీబీ పర్యావరణ ఇంజినీరు పీవీ కిషోర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులు వేగవంతం చేయాలి

- జాతీయ రహదారి 544–డీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారి పనులపై సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. సోములదొడ్డి నుంచి ముచ్చుకోట వరకు 37 కిలోమీటర్లు, ముచ్చుకోట నుంచి బుగ్గ వరకు 32 కిలో మీటర్లు జాతీయ రహదారి 544–డీ చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించి పెండింగ్ ఉన్న భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

'అప్రమత్తంగా ఉండండి'

అనంతపురం అర్బన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. విపత్తుల సంస్థ సూచనల మేరకు జిల్లాలో పలుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే టప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. చెట్లు, టవర్లు, విద్యుత్ స్తంభాల కింద, మైదానాల్లో ఉండకూడదన్నారు. సురక్షిత భవనాల్లో ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'ఆ జీఓ వెనుక కుట్ర'



మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల్లోకి బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధించే జీఓ వెనుక కుట్ర దాగి ఉందని వైఎస్సార్ విద్యార్థి విభాగం నేతలు ధ్వజమెత్తారు. జైల్లో ఖైదీలను కలిసే అవకాశం ఉంది కానీ పాఠశాలల్లో విద్యార్థులను కలిసే అవకాశం లేకుండా చేశారని మండిపడ్డారు. ఆ జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం లేదని మంత్రి లోకేష్ రెడ్‌బుక్ పాలన అమలవుతోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే పాఠశాలల్లోకి ఎవరూ వెళ్లకూడదనే జీఓ తెచ్చారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే మంత్రి లోకేష్ లక్ష్యంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు కూటమి ప్రభుత్వం కొమ్ము కాస్తోందన్నారు. నగర అధ్యక్షుడు కైలాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ రెడ్‌బుక్ పాలనపై పెట్టిన దృష్టి పిల్లల బుక్కులపై పెట్టలేదన్నారు. జీఓ రద్దు చేయకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడు రేవంత్, నగర నాయకులు రాహుల్ రెడ్డి, ఆదిల్, అశోక్, నరేంద్రరెడ్డి, సిద్దిక్, రోహిత్, జిలాన్, సతీష్, నాగేంద్ర, సాయి, రవి, పూజ విగ్నేష్, బాబా, ఇమ్రాన్, సురేంద్ర, చరణ్ పాల్గొన్నారు.

అన్నదాత అరణ్య రోదన

యూరియా కోసం రైతులకు అవే కష్టాలు
- నెలవారీ కోటా మేరకు సరఫరా కాకపోవడంతో దుస్థితి
- పట్టించుకోని కూటమి మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులు



అనంతపురం డీసీఎంఎస్ కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం బారులుతీరిన రైతులు



డీసీఎంఎస్ సిబ్బంది కోసం ఎదురుచూపులు

అనంతపురం అగ్రికల్చర్: యూరియా కోసం అన్నదాత పడుతున్న ఆవేదన అరణ్యరోదన గానే మిగులుతోంది. విస్తారంగా వర్షాలు పడటంతో వేరుశనగ, కంది, ఆముదం, మొక్కజొన్న తదితర పంటలకు పైపాటుగా యూరియా వేసుకోవాలని అటు వ్యవసాయశాఖ అధికారులు,ఇటు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరో పక్క వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ పరిస్థితుల్లో యూరియా కోసం అన్నదాత పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. డీఏపీ, కాంప్లెక్స్‌ల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

గతంలో ఎప్పుడూ ఇలా లేదు..

2019–2024 మధ్య కాలంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. లక్షల హెక్టార్ల ఖరీఫ్, రబీ పంటలు సాగులోకి వచ్చాయి. ఉద్యాన పంటలు కూడా విస్తరించాయి. కానీ ఎన్నడూ ఎక్కడా ఎరువుల కొరత ఉత్పన్నం కాలేదు. ఆర్‌బీకేలు, సొసైటీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో రైతుకు గ్రామంలోనే అవసరమైన ఎరువు లభించేది. కానీ చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టిన 14 నెలల కాలంలోనే రైతుకు కష్టాలు మొదలయ్యాయి.

కోటా ప్రకారం రావట్లేదు..

ఈ సీజన్‌లో యూరియా అరకొరగా సరఫరా అవుతోంది. కంపెనీలు తమ టార్గెట్ మేరకు నెలవారీ కోటా ప్రకారం సరఫరా చేయడం లేదని సమాచారం. ఖరీఫ్‌లో జిల్లాకు అన్ని రకాల ఎరువులు 1.07 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నారు. అందులో యూరియా 26,839 మెట్రిక్ టన్నులు ఖరారు చేశారు. రెండు, మూడేళ్లుగా జిల్లాలో కంది, ఆముదం, మొక్కజొన్న పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగిన విషయాన్ని అధికారులు మరచిపోయారు. 2019–24 మధ్య కాలంలో విస్తారంగా వర్షాలు పడటంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో వరి విస్తీర్ణం, ఉద్యాన పంటల సాగు కూడా స్థిరంగా కొనసాగుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని యూరియా ప్రతిపాదనలు పెంచకుండా గత పదేళ్లుగా ఇస్తున్నట్లుగానే ఇవ్వడంతో సమస్య ఎదురైంది. కనీసం కేటాయింపుల మేరకు అయినా సరఫరా చేయించలేకపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో యూరియా సమస్య రోజురోజుకు అధికమవుతోంది. రైతులు ప్రైవేట్ డీలర్లు, దుకాణాలు, డీసీఎంఎస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆర్‌ఎస్‌కేల వద్ద బారులు తీరుతున్నారు. అరకొరగా లారీల్లో వస్తున్న యూరియా వచ్చింది వచ్చినట్లే ఖాళీ అవుతోంది. అది కూడా ఆధార్ కార్డు, బయోమెట్రిక్ ద్వారా ఒక్కో రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నా... కొరత తగ్గడం లేదు. ద్రవరూపంలో ఉన్న నానో యూరియా అంటున్నా దాని వాడకం, ఉపయోగంపై రైతులకు సరైన అవగాహన కల్పించడం లేదు.

రాబోయే రోజుల్లో మరింత జఠిలం..

విస్తారంగా వర్షాలు పడటంతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. ఈనెలతో పాటు వచ్చే సెప్టెంబర్‌లో కూడా పంటలకు యూరియా వాడకం అధికంగా ఉంటుందని చెబుతున్నారు. దీంతో ముందు యూరియా సమస్య మరింత జఠిలం కానుందని అంచనా వేస్తున్నారు. కోటా మేరకు సరఫరా చేసి ఉంటే సమస్య ఉండేది కాదని చెబుతున్నారు. 26,839 మెట్రిక్ టన్నుల కేటాయింపుల్లో ఏప్రిల్‌లో 1,932 మెట్రిక్ టన్నులు, మేలో 2,771 మెట్రిక్ టన్నులు, జూన్‌లో 3,361, జూలైలో 5,927 మెట్రిక్ టన్నులు, ఆగస్టులో 6,021 మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 6,827 మెట్రిక్ టన్నులు మేర జిల్లాకు సరఫరా కావాల్సి ఉన్నా... ఆ మేరకు రాలేదని చెబుతున్నారు. యూరియా సరఫరాపై అటు వ్యవసాయశాఖ ఇటు మార్క్‌ఫెడ్ అధికారులు నోరుమెదపడం లేదు. ఎంత వచ్చింది... ఎక్కడ సరఫరా చేశారు... ఎంత పంపిణీ చేశారనే వివరాలు చెప్పని పరిస్థితి నెలకొంది. అటు కూటమి నాయకులు, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా ఎరువుల కొరత ముఖ్యంగా యూరియా సమస్యపై పట్టించుకోకపోవడంతో రైతన్న కష్టాలు రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి. అనంతపురంలో ఉన్న డీసీఎంఎస్‌కు రోజూ 24 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తే కానీ రైతుకు సర్దుబాటు చేయడానికి కాదు. అలాంటిది సగటున 6 నుంచి 8 మెట్రిక్ టన్నులు వస్తుండటంతో రైతులు ఉదయం 7 గంటలకే బారులు తీరుతున్న పరిస్థితి నెలకొంది.

ఎందుకిలా జరుగుతోంది..?

అనంతపురం అర్బన్: అవసరానికి మించి యూరియా సరఫరా చేసినా క్షేత్రస్థాయిలో రైతులకు ఎందుకు కొరత ఏర్పడుతోందని కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రశ్నించారు. వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారా అనే దానిపై విచారణ చేసి 48 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 26,839 టన్నుల యూరియా అవసరం కాగా 29,527 టన్నుల లభ్యత ఉందని, ఇందులో 26,008 టన్నులు విక్రయించగా.. ఇంకా 3,519 టన్నులు అందుబాటులో ఉందన్నారు. యూరియా వినియోగంపై డీఎస్‌ఓ, పరిశ్రమలు, కార్మిక, ఎక్సైజ్, కాలుష్య నియంత్రణ మండలి, డీటీసీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. యూరియా వ్యవసాయానికి కాకుండా మరెందుకైనా ఉపయోగించారా అనేది నిర్ధారించాలన్నారు. పౌర సరఫరాల శాఖతో సమన్వయం చేసుకుని ఏడీబీఎల్‌యూ యూనిట్లను తనిఖీ చేయాలన్నారు. పరిశ్రమలు, కార్మిక, కాలుష్య మండలి సమన్వయం చేసుకుని రంగులు, వార్నిష్ యూనిట్లను తనిఖీ చేయాలని చెప్పారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, సీఎస్‌డీటీలు, ఎస్‌ఐలతో కూడిన బృందాలు పాల్గొనాలన్నారు. సరిహద్దు రాష్ట్రాలకు సబ్సిడీ యూరియా, ఎరువులు అనధికార తరలింపు నిరోధానికి విజిలెన్స్, రవాణా, పోలీసు శాఖలు నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. సబ్సిడీ యూరియాను వ్యవసాయానికి కాకుండా ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తే జరిమానా లేకుంటే జైలు శిక్ష.. ఒక్కోసారి రెండూ విధిస్తారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మా కష్టాలు తీర్చండి

- 'పరిష్కార వేదిక'లో 550 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'మా కష్టాలు తీర్చండి' అంటూ 'పరిష్కార వేదిక'లో అధికారులకు ప్రజలు విన్నవించుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినోద్ కుమార్‌తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఎఫ్ఎస్‌ఓ జి.రామకృష్ణారెడ్డి తదితరులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 550 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమక్షించారు. అర్జీదారుల సమస్యను తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

- భూమి తక్కువ చేసి ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారని శింగనమలకు చెందిన విక్రమ్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. నరసాపురం గ్రామం సర్వే నంబరు 242–2సీలో 2.50 ఎకరాలు, 242–2బీలో 2.50 ఎకరాలు ఉందని, ఆన్‌లైన్‌లో మాత్రం నాలుగు ఎకరాలే నమోదు చేశారని వాపోయాడు.
- ఇంటి స్థలం ఇచ్చినట్లుగా పట్టాపారం ఇచ్చారని, అయితే అధికారులు స్థలం చూపలేదని అనంతపురంలోని రహమత్‌నగర్‌కు చెందిన ఉదయభాను ఫిర్యాదు చేసింది. ఇంటి స్థలం చూపించడంతో పాటు పక్కా గృహం మంజూరు చేసి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరింది.
- భర్త పింఛను తనకు ఇప్పించాలని బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన 75 ఏళ్ల బండి లక్ష్మక్క కోరింది. తన భర్త వెంకటరాముడుకు పింఛను వచ్చేదని, ఆయన రెండున్నరేళ్ల క్రితం మరణించాడని చెప్పింది. భర్త పింఛను ఇప్పించాలని ఏడాదిగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదంది. ఎవరూ లేని తనకు పింఛను వచ్చేలా చేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించుకుంది.

పేదల బతుకులతో ఆటలా?

- వైకల్యమున్నా తక్కువగా చూపి పింఛన్లు తొలగిస్తారా..
- దివ్యాంగుల ఆవేదన
- రెవెన్యూభవన్ వద్ద ధర్నా



రెవెన్యూభవన్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

అనంతపురం అర్బన్: రీ వెరిఫికేషన్ పేరిట వైకల్యం తక్కువగా చూపించి తమ బతుకులతో ఆటలాడడం న్యాయమా అంటూ దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛను పునరుద్ధరించాలంటూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ వద్ద దివ్యాంగులు ధర్నా చేశారు. న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్, కో–ఆర్డినేటర్ హరినాథరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లకు పైగా పింఛను తీసుకుంటున్న దివ్యాంగులనూ రీ–వెరిఫికేషన్ పేరుతో తొలగించారన్నారు. వైద్యులు ఉద్దేశపూర్వకంగా వైకల్యం తక్కువ చేసి సర్టిఫికెట్ ఇస్తున్నారని మండిపడ్డారు. దివ్యాంగులకు ఈ నెలలో తొలగించిన పింఛన్లు తక్షణం పునరుద్ధరించాలన్నారు. ఇకపై దివ్యాంగులకు ఏ కారణంగానూ పింఛను తొలగించకూడదని డిమాండ్ చేశారు. అన్యాయం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, కార్యదర్శి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎలా బతకాలి?

రెండేళ్లుగా పింఛను తీసుకుంటున్నా. ఇప్పుడు వైకల్యం తక్కువగా ఉందంటూ పింఛను తొలగిస్తే ఎలా బతకాలి. పింఛను డబ్బుతో మందులు కొనుక్కునేవాడిని. పెన్షన్ రాకపోతే మందుల కోసం డబ్బులు ఎవరిని అడుక్కోవాలి.

– రామలింగ, గోళ్ల గ్రామం, కళ్యాణదుర్గం మండలం

84 శాతం వైకల్యాన్ని 40 శాతం చూపారు



బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న మా కుమారుడు రవితేజకు వచ్చేనెల నుంచి పింఛను నిలిపివేస్తున్నట్లు నోటీసు ఇచ్చారు. రవితేజకు ఆరేళ్ల వయసున్నప్పటి నుంచి పింఛను వస్తోంది. ఇప్పుడు 22 సంవత్సరాలు. 84 శాతం వైకల్యం ఉంటే రీ వెరిఫికేషన్‌లో 40 శాతం కంటే తక్కువగా ఉందని చెప్పారు. – కదిరప్ప, రమాదేవి, మరూరు గ్రామం, రాప్తాడు మండలం

తిరుమలకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం
- మృతులు కర్ణాటక వాసులు
- మరో 9 మందికి గాయాలు
- ఢీకొన్న ఆర్టీసీ బస్సు, రెండు టూరిస్ట్ బస్సులు



ఆర్టీసీ బస్సును ఢీ కొని నుజ్జునుజ్జయిన టూరిస్ట్ బస్సు

తనకల్లు: శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు, రెండు టూరిస్ట్ మినీబస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టూరిస్ట్ బస్సుల్లోని అనసూయమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ మణికంఠ (41), నాగేంద్రప్ప (45), జాహ్నవి (4) చికిత్స పొందుతూ మరణించారు. మృతులంతా కర్ణాటక వాసులే. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని బళ్లారి ప్రాంతానికి చెందిన భక్తులు రెండు టూరిస్ట్ మినీబస్సుల్లో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం బళ్లారికి తిరుగు పయనమయ్యారు. మార్గ మధ్యంలో మండ్లిపల్లి జాతీయ రహదారిపై ఉన్న మలుపు వద్ద కదిరి నుంచి మదనపల్లి వెళుతున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న టూరిస్ట్ బస్సు ఢీకొంది. ఆ వెనుకనే వస్తున్న మరో టూరిస్ట్ బస్సు ముందున్న టూరిస్ట్ బస్సును ఢీకొట్టింది. ఒకదానికొకటి బలంగా ఢీ కొనడంతో ముందున్న టూరిస్ట్ బస్సు నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న అనసూయమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. చిన్నారి జాహ్నవి, డ్రైవర్ మణికంఠ, నాగార్జున, కుమార్‌స్వామి, భార్గవి, రిత్విక, నాగేంద్రప్ప, గోవిందమ్మ, గోవిందప్ప, రాకేష్, చిన్నమ్మ, అంజినమ్మ తీవ్రంగా గాయపడ్డారు.



మృతి చెందిన అనసూయమ్మ, తనకల్లు ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు

మండలంలో ఉచితంగా అంబులెన్స్ సేవలు నిర్వహిస్తున్న 'వందేమాతరం టీం' సభ్యులు బాధితుల్ని తమ అంబులెన్స్‌లో తనకల్లు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు తీవ్రంగా గాయపడిన జాహ్నవి, నాగేంద్రప్ప, మణికంఠ, నాగార్జున, రిత్విక, భార్గవిలను కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో డ్రైవర్ మణికంఠ, నాగేంద్రప్ప, జాహ్నవి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరు మృతి చెందారు. తనకల్లు ఎస్‌ఐ గోపి ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. మండ్లిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సంతాపం తెలిపారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

దగ్గుపాటీ.. బహిరంగ క్షమాపణ చెప్పు



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చిత్రపటాలను కాళ్లతో తొక్కుతున్న దృశ్యం



రాయదుర్గంలో నిరసన తెలుపుతున్న ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు

- గుత్తి, రాయదుర్గంలో కదం తొక్కిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు
- ఎమ్మెల్యే చిత్రపటాలను చెప్పు కాళ్లతో తొక్కి నిరసన

గుత్తి: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. గుత్తిలో సోమవారం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కదం తొక్కారు. పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద నిరసనకు దిగారు. ఎమ్మెల్యే దగ్గుపాటి చిత్రపటాలను చెప్పుకాళ్లతో తొక్కిన అనంతరం కాల్చివేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం పట్టణ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు సాదిక్, కార్యదర్శి నాగేంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్‌ను వ్యక్తిగతంగా తిట్టడం దారుణమన్నారు. ఎన్నికల్లో టీడీపీ గెలవడానికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కూడా కారణమన్నారు. ముఖ్యంగా ప్రసాద్ గెలవడానికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కీలకపాత్ర పోషించారన్నారు. తామే ఓటు వేయకుంటే ఎక్కడుండేవాడివంటూ ప్రశ్నించారు. జూనియర్ ఎన్టీఆర్‌కు దేశవ్యాప్తంగా అభిమానులున్నారని, వారు తలచుకుంటే అనంతపురంలో కూడా దగ్గుపాటి తిరగలేడని హెచ్చరించారు. వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పి తీరాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు రామ్మోహన్, అశోక్, మారేష్, నరేష్, మస్తాన్, అరవింద్, భాస్కర్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో..

రాయదుర్గంటౌన్: జూనియర్ ఎన్టీఆర్ నటించిన సినిమా వార్–2 విడుదల సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై రాయదుర్గంలో ఎన్టీఆర్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బళ్లారి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. తిప్పేస్వామి, వెంకటేశులు, ఓబలేశు, మలకన్న, పొంపాపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సౌత్‌జోన్ సీనియర్ ఉమెన్ క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియం వేదికగా ఈ నెల 11 నుంచి జరుగుతున్న సౌత్ జోన్ సీనియర్ ఉమెన్ క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జిల్లా జట్టు నిలిచింది. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకుంది. సోమవారం చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్ల నష్టానికి కడప జట్టు 101 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు కేవలం 17.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 101 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. చిత్తూరు 9 వికెట్ల తేడాతో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో చిత్తూరు జట్టు నిలవగా, రెండో స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో కర్నూలు, నాల్గో స్థానంలో కడప, ఐదో స్థానంలో నెల్లూరు జట్లు నిలిచాయి. విజేత జట్టును అభినందిస్తూ ట్రోఫీని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి వి.భీమలింగారెడ్డి అందజేశారు.

జేవీవీ జిల్లా కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే దిశగా జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ వెల్లడించారు. సోమవారం జేవీవీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా కన్నేపల్లి చిత్తప్ప, ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, శివానంద, శశికళ, ప్రసాదరెడ్డి, రాజన్న, నాగరత్న, ప్రధాన కార్యదర్శిగా కెంచాల వీర్రాజు, కార్యదర్శులుగా తిరుపాల్, తిప్పేస్వామి, రాఘవేంద్ర, సింహాద్రి, రంగనాథ్, రామచంద్రయ్య, కోశాధికారిగా మహమ్మద్ జిలాన్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ రంగన్న, డాక్టర్ ప్రసూన, సాకే భాస్కర్, గౌరవ సలహాదారులుగా మల్లికార్జున, వీకే పద్మావతిను ఎంపిక చేసినట్లు వివరించారు. అలాగే సబ్ కమిటీల కన్వీనర్లలో వైద్య కమిటీకి లక్ష్మీనారాయణ, విద్యా కమిటీకి గాంగేనాయక్, సమతా కమిటీకి రాధాప్రసాద్, ఆడిట్‌కు శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీకి వెంకచల రామిరెడ్డి తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జేవీవీ భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలను ఆమోదించారు.

బస్సులో ప్రయాణికుడి మృతి

బుక్కరాయసముద్రం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడు గుండెపోటుకు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన బాబావలి (65) అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమవారం ఉదయం కడప వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. బీకేఎస్ వద్దకు చేరుకోగానే సీటులో కూర్చొన్నట్టుగానే కిందకు వాలిపోయాడు. గమనించిన ప్రయాణికులు అప్రమత్తం చేయడంతో బస్సును ఆపి డ్రైవర్, కండెక్టర్ పరిశీలించారు. గుండెపోటుకు గురై మృతి చెందినట్లుగా నిర్ధారించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

వర్ధమాన క్రీడాకారులతో చెడుగుడు

- క్రీడల్లో గిరిజన విద్యార్థులు రాణించకుండా సర్కార్ అడ్డుపుల్ల
- అగమ్యగోచరంగా మారిన స్పోర్ట్స్ స్కూళ్ల పరిస్థితి

క్రీడల అభివృద్ధికి కూటమి సర్కార్ సహకారం పూర్తిగా కొరవడింది. కొన్నేళ్లుగా మితిమీరిన రాజకీయ జోక్యం వర్ధమాన క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. అధికారంలో ఉన్న కూటమి పార్టీల ప్రాపకం కోసం క్రీడా సంఘాల ప్రతినిధులు వెంపర్లాడటంతో అసలు లక్ష్యం మరుగున పడిపోయింది. ఇది అణగారిన గిరిజన విద్యార్థుల ఉజ్వల భవితకు ఆటంకంగా మారింది.

అనంతపురం: క్రీడా కుసుమాలను వెలికితీయాలంటే క్షేత్ర స్థాయిలో యువతను ప్రోత్సహించాలి. మట్టిలో మాణిక్యాలకు సరైన శిక్షణ ఇచ్చి వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరచాలి. ఈ ఉద్దేశంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం స్పోర్ట్స్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కోచ్‌లనూ నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గిరిజన విద్యార్థుల క్రీడావకాశాలపై కోలుకోలేని దెబ్బ తీసింది. స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు సైతం నిలిపి వేసి వర్ధమాన క్రీడాకారుల జీవితాలతో చెడుగుడు ఆడుకుంటోంది.

నాడు రాణింపు..

గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా అరకులో ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ స్కూల్‌కు అనుబంధంగా రాష్ట్రంలో ఆరు క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేశారు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట (బాలురు), భద్రగిరి (బాలికలు), తూర్పుగోదావరి జిల్లా ముసురుమిల్లి (బాలురు), ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం (పీజీటీ–బాలురు), నంద్యాల జిల్లా మహానంది (బాలికలు), అనంతపురం జిల్లా గొల్లలదొడ్డి (బాలురు)లో స్పోర్ట్స్ స్కూళ్లు అందుబాటులోకి వచ్చాయి. గొల్లలదొడ్డిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో అథ్లెటిక్స్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 720 మంది బాల, బాలికలు ఆటల పోటీల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించే ఈ స్పోర్ట్స్ స్కూళ్లు 2022లో ఏర్పాటయ్యాయి. ఒక్కో ఈవెంట్‌కు ఒకరు చొప్పున మొత్తం 23 మంది కోచ్‌లను నియమించారు. క్రీడా పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అడ్మిషన్ కల్పించేవారు. దీంతో నాడు అనేక మంది గిరిజన విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న స్పోర్ట్స్ స్కూల్‌లో చేరి క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుని అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లోనూ రాణించారు.



గొల్లల దొడ్డి స్పోర్ట్స్ స్కూల్‌లో సాధన చేస్తున్న విద్యార్థులు

అడ్మిషన్లకు నిరాకరణ

గిరిజన విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను కూటమి ప్రభుత్వం తొక్కి పెట్టింది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 14 నెలలు కావస్తున్నా.. స్పోర్ట్స్ స్కూళ్లలో ఒక్క గిరిజన విద్యార్థికి కూడా అడ్మిషన్ ఇచ్చిన పాపాన పోలేదు. కోచ్‌లు ఉన్నప్పటికీ విద్యార్థుల అడ్మిషన్లు లేకపోవడంతో మొత్తం ఆరు స్పోర్ట్స్ స్కూళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ప్రభుత్వ తీరుపై గిరిజన సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు కల్పించడకపోవడం వల్ల గిరిజన విద్యార్థులు తమలోని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం కోల్పోతున్నారని ఆందోళన చెందుతున్నారు. గిరిజన పిల్లలు క్రీడల్లో ఎదగకుండా ఈ ప్రభుత్వం ఎందుకు కక్ష కట్టిందో అర్థం కావడం లేదని వాపోతున్నారు. వెంటనే స్పోర్ట్స్ స్కూళ్లలో గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి, వారిని ఉన్నత స్థాయిలో చూసుకునే అవకాశమివ్వాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

20 నుంచి కోర్టు ఉద్యోగ నియామక పరీక్షలు

అనంతపురం: జిల్లాలోని న్యాయస్థానాల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రేడ్–3 స్టెనోగ్రాఫర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఎగ్జామినర్, ఫీల్డ్ అసిస్టెంట్, కాపీయిస్ట్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 20 నుంచి రాత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు సోమవారం వెల్లడించారు. ప్రతి రోజూ మూడు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20, 21, 22, 23వ తేదీల్లో చిన్నయనగర్‌లోని ఎన్‌సీసీ ఎస్‌ఏఐలో, 23, 24 తేదీల్లో బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ, అనంతపురం రూరల్ పరిధిలోని ఇటుకలపల్లి వద్ద ఉన్న అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో, 22, 23, 24 తేదీల్లో తాడిపత్రిలోని సీవీ రామన్ ఇనిస్టిట్యూట్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న పరీక్షలకు 7.30 గంటలకే అభ్యర్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు గేట్లు మూసివేస్తారు. రెండో షిఫ్ట్‌లో పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 11 గంటలకు రిపోర్ట్ చేసుకోవాలి. మధ్యాహ్నం 12.15 గంటలకు గేట్లు మూసివేస్తారు. మూడో షిఫ్ట్‌లో పరీక్ష రాసే అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గంటలకు రిపోర్ట్ చేసుకోవాలి. మధ్యాహ్నం 3.45 గంటలకు గేట్లు మూసివేస్తారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌లో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే హెల్ప్ డెస్క్ (86323 72752)ను సంప్రదించవచ్చు.

వ్యక్తి బలవన్మరణం

బొమ్మనహాళ్: మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ (47) ఆత్మహత్య చేసుకున్నాడు. పలు దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తితో సోమవారం ఇంటి పై అంతస్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేద్దాం

- గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.కె.అనిల్‌కుమార్

రాప్తాడు: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.కె.అనిల్ కుమార్ ఆదేశించారు. రాప్తాడు మండలం జి.కొత్తపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానంతో మహిళా రైతులు అనిత 4 ఎకరాల్లో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట, లోకేశ్వరి సాగు చేసిన సీతా ఫలం, టమాట, అలసంద పంటలు, లక్ష్మీదేవి సాగు చేస్తున్న ఏటీఎం మోడల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామంలో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలకు పెట్టుబడి తక్కువగా ఉంటుందని, దిగుబడులు పెరుగుతున్నాయని రైతులు తెలిపారు. ఈ పంటలకు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకున్న అభివృద్ధి చెందిన దేశాలే పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలను, నాణ్యమైన దిగుబడులను సాధించాలంటే ప్రకృతి వ్యవసాయమే ఉత్తమమైనదన్నారు. ప్రతి రైతూ ఆర్థికంగా బలపడాలంటే ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టడం ఒక్కటే మార్గమన్నారు. ఏటీఎం మోడల్‌తో రోజు వారీ ఆదాయాన్ని పొందవచ్చన్నారు. 18 సెంట్లలో 22 రకాల ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసిన లక్ష్మీదేవిని అభినందించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన పంటలను స్టాల్స్‌గా ఏర్పాటు చేయడంతో వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ రహేర్, సెర్ప్ సీఈఓ శ్రీరాములు నాయుడు, డీపీఎం లక్ష్మానాయక్, ఉన్నతి డైరెక్టర్ శివశంకర్, స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఎం సునీత, రైతులు పాల్గొన్నారు.



అదనపు కార్యదర్శి అనిల్‌కుమార్‌కు ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

సంఘాలతో మహిళల ఆర్థికాభివృద్ధి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాలలో సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.కె.అనిల్‌కుమార్ అన్నారు. బీకేఎస్‌లోని వెలుగు కార్యాలయంలో సోమవారం ఆయన మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించిన మహిళలను అభినందించారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహేర్, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ప్రకాష్ చౌదరి (ఫైల్)

అనంతపురం: తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన యువకుడు అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన మద్దినేని మనోహర్ నాయుడు, రమణమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ప్రకాష్‌చౌదరి (22) నర్సరీ నుంచి పదో తరగతి వరకు అనంతపురంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో చదివాడు. అనంతరం గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ మానేశాడు. ఇరవై రోజుల క్రితం అనంతపురానికి వచ్చి తన స్నేహితులతో కలసి ఆదర్శ నగర్‌లో అద్దె గదిలో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టాడు. అయితే ఉద్యోగ ప్రయత్నాలు ఫలించకపోవడంతో సోమవారం తెల్లవారు జామున గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారు జామున నిద్రలేచిన స్నేహితులు.. ఉరికి విగతజీవిగా వేలాడుతున్న ప్రకాష్‌చౌదరిని గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటినా అనంతపురానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న అనంతపురం రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, సేవా దృక్పథంతో కుమారుని నేత్రాలను తల్లిదండ్రులు దానం చేశారు.

బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం: ఏపీ ప్రభుత్వం 2025–28 సంవత్సరానికి గాను జిల్లాలో 19 బార్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఉన్న బార్‌ల గడువు ముగిసిందని, వీటి స్థానంలో కొత్త బార్‌లు ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 9, గుంతకల్లులో ఒకటి, తాడిపత్రిలో 4, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గంలో ఒక్కొక్కటి చొప్పున బార్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వేలం పద్ధతిలో కాకుండా, లక్కీ డ్రా ఆధారంగా కేటాయిస్తామన్నారు. నాన్ రీఫండబుల్ కింద దరఖాస్తు రుసుము రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. బార్ కేటాయిస్తే ఏడాదికి రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజు, రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు మొత్తాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్ /హైబ్రిడ్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 28న కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో లక్కీ డ్రా నిర్వహిస్తారన్నారు.

వీహెచ్‌ఏల బదిలీల్లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

- గ్రీవెన్స్‌లో వినతి పత్రం ఇచ్చిన ఉద్యాన శాఖ సహాయకులు

అనంతపురం అగ్రికల్చర్: గత నెల ఉద్యానశాఖలో నిర్వహించిన బదిలీ ప్రక్రియల్లో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ల (వీహెచ్‌ఏ)కు తీరని అన్యాయం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా అధికారులకు వీహెచ్‌ఏలు డి.నరసింహులు, ఎం.కీర్తన, ఎం.ఆంజనేయులు, హెచ్.ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. తమతో పాటు పలువురు ఎస్సీ, ఎస్టీ క్యాటగిరీ అసిస్టెంట్లను ఇష్టారాజ్యంగా బదిలీ చేశారని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారికి, సస్పెన్షన్‌కు గురైన వారికి, భోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగంలో చేరిన వారికి, రాజకీయ పలుకుబడి కలిగిన వారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చారని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ అసిస్టెంట్లను మాత్రం ఇష్టారాజ్యంగా బదిలీ చేశారన్నారు. కౌన్సెలింగ్‌లో ఓ అధికారి కీలకపాత్ర పోషించారని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

- వృద్ధుడి మృతదేహంతో గుత్తి సీహెచ్‌సీ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



మృతుడు మారెప్ప

గుత్తి: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మారెప్ప మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు గుత్తిలోని కమ్యూనిటీ వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాలు.. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న పెద్దవడుగూరు మండలం గుత్తి వెంకటాంపల్లి గ్రామానికి చెందిన మారెప్ప(60)ను కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం గుత్తి లోని సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఆ సమయంలో జ్వర తీవ్రత మరింత ఎక్కువైంది. విషయాన్ని వైద్యులకు తెలిపినా వారు సకాలంలో స్పందించలేదు. ఈ క్రమంలో సాయంత్రం మారెప్ప మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ మారెప్ప మృతదేహంతో ఆస్పత్రిలోనే ఆందోళనకు దిగారు. ఆందోళనకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్ మద్దతు పలికారు. సమాచారం తెలుసుకున్న అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు సురేష్, గౌతమ్, హెడ్ కానిస్టేబుల్ హనుమంతు తదితరులు ఆస్పత్రికి చేరుకుని మృతుడి భార్య రామాంజినమ్మ, కుమారుడు ఓబులరాజు, కుటుంబ సభ్యులు, బంధువులతో చర్చించారు. ఇక్కడికి రాకముందే మరో ఆస్పత్రిలో చికిత్స చేయించారని ఆస్పత్రి సూపరిండెండెంట్ డాక్టర్ యల్లప్ప తెలపడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యమే మారెప్ప మృతికి కారణమంటూ ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

సరుకుల పంపిణీపై ఆరా

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఏ మేరకు సరుకులు పంపిణీ చేశారో వివరాలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్లను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదేశించారు. కేంద్రాల వారీగా పంపిణీ వివరాలు ఇవ్వాలని అంగన్‌వాడీ సెక్టార్ వాట్సాప్ గ్రూపుల్లో సమాచారాన్ని పోస్టు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సరుకుల పంపిణీలో నెలకొన్న గందరగోళంపై ఈ నెల 17న 'అందని అంగన్‌వాడీ సరుకులు' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు కార్యాచరణను చేపట్టారు. యాప్‌ల భారంతో ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు తమకు 2018లో ఇచ్చిన సెల్‌ఫోన్లను అధికారులకు తిరిగి ఇచ్చారు. సెల్‌ఫోన్లు లేకపోవడంతో ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా లబ్ధిదారులకు సరుకుల పంపిణీ నిలిచిపోయింది. ఈ పంపిణీపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో టీచర్లు సరుకుల పంపిణీ చేయలేదు. గుడ్లు, పాలు చెడిపోయే అవకాశం ఉండటంతో కొన్ని చోట్ల యూనియన్ నాయకుల సూచనల మేరకు సరుకుల పంపిణీ జరిగింది. ఉన్నతాధికారుల నుంచి సరుకుల పంపిణీపై అధికారికంగా ఎలాంటి ఆదేశాలు రాకపోయిన సరుకుల పంపిణీ చేశారన్న దానిపై జిల్లా అధికారులు సమాచార సేకరణలో పడ్డారు. ఐసీడీఎస్ పీడీ నాగమణి మాట్లాడుతూ... ఎఫ్‌ఆర్‌ఎస్ లేకుండా సరుకుల పంపిణీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదన్నారు. ఉత్తర్వులు వచ్చిన తరువాత పంపిణీపై ఆదేశాలిస్తామన్నారు. ఇప్పటికే పలుచోట్ల సరుకుల పంపిణీ చేశారన్న దానిపై వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

జీజీహెచ్ వైద్యం.. దైవాధీనం



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో క్యాంటీన్ స్థలంలో స్టోరేజీ పరికరాల మధ్య రోగికి చికిత్స చేస్తున్న దృశ్యం



రోగుల సంఖ్యకు అనుగుణంగా సీఎంఓలు లేక కిక్కిరిసిన సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీ

- రోగుల ప్రాణాలతో చెలగాటం
- అనవసర ప్రాంతాల్లో వైద్యుల ఏర్పాటు
- సూపర్ స్పెషాలిటీ క్యాజువాలిటీలో ఒక్క రోగికి నలుగురు సీఎంఓలు
- జీజీహెచ్ ఎమర్జెన్సీలో 800 నుంచి వెయ్యి వరకూ ఓపీ
- సీఎంఓల కొరతతో జీజీహెచ్‌లో రోగులపై ప్రభావం
- నిబంధనలకు విరుద్ధంగా 'సూపర్' క్యాంటీన్‌లో క్యాజువాలిటీ ఏర్పాటు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో వైద్య సేవలు అడుగంటుతున్నాయి. అత్యవసర ప్రాంతాల్లో వైద్యులను నియమించకుండా అనవసర ప్రాంతాలకు కేటాయించడంతో రోగులు నరక యాతన అనుభవిస్తున్నారు. దీనికి తోడు మౌలిక వసతులు లోపించడంతో రోగులకందే సేవల్లో నాణ్యత లోపిస్తోంది.

ఒక్క రోగికి నలుగురు సీఎంఓలు

ఈ నెల 11 నుంచి తలకు సంబంధించిన కేసులు నేరుగా అనంతపురంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లవచ్చునని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం ప్రకటించారు. ఈ క్యాజువాలిటీకి ఏకంగా నలుగురు సీఎంఓలను ఏర్పాటు చేశారు. సరాసరి రోజుకు ఒకరిద్దరుకు మించి రోగులు ఉండడం లేదు. ఈ లెక్కన ఒక రోగికి నలుగురు సీఎంలు చికిత్స చేయాల్సి వస్తోంది. వాస్తవానికి సూపర్ స్పెషాలిటీలో క్యాజువాలిటీ ఏర్పాటుకు సౌకర్యాలు లేకపోయినా క్యాంటీన్‌కు కేటాయించిన గదిలోనే ఏర్పాటు చేశారు. అందులో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్, పల్స్ ఆక్సీమీటర్లు, వెంటిలేటర్లు, విద్యుత్ సరఫరా బోర్డులు, తదితర వాటిని ఏమీ లేవు. డీఎంఈ ఆదేశించారంటూ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం ముందుచూపు లేకుండా సూపర్‌లో క్యాజువాలిటీ ఏర్పాటు చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

జీజీహెచ్ క్యాజువాలిటీలో ఆరుగురు సీఎంఓలు

సర్వజనాస్పత్రిలో క్యాజువాలిటీకి రోజూ మూడు షిఫ్టుల్లో 800 నుంచి వెయ్యి మంది వరకు రోగులు వస్తుంటారు. ఇలాంటి తరుణంలో పదుల సంఖ్యలో సీఎంఓల అవసరం ఉంటుంది. అయితే ఇటీవల క్యాజువాలిటీలో విధులు నిర్వర్తించే ఓ సీఎంఓను నిబంధనలకు విరుద్ధంగా సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు నియమించారు. ప్రస్తుతం ఆరుగురు సీఎంఓలతోనే సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీ నడుస్తోంది. గతంలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోకి నలుగురు సీఎంఓలు వివిధ స్పెషాలిటీ సేవల్లో ఓపీలకు వినియోగిస్తున్నారు.

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం



కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పెరుగుతోంది. ఇన్‌ఫ్లో పెరగడంతో 18 రోజులకే 2.17 టీఎంసీల నీరు చేరుకుంది. సోమవారం నాటికి రిజర్వాయర్‌లో 4.024 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటరమణ తెలిపారు. సత్యసాయి, శ్రీరామరెడ్డి, అనంతపురం, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు, నీటి ఆవిరి, లీకేజీల రూపంలో రోజుకు దాదాపు 130 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని వివరించారు.

మద్యం మత్తులో భార్య గొంతు కోసిన భర్త

అనంతపురం: మద్యంలో మత్తులో కట్టుకున్న ఇల్లాలి గొంతును భర్త కోశాడు. అనంతపురం రెండో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ఓబులంపల్లి తండాకు చెందిన రవి నాయక్, భాగ్యబాయి దంపతులు ధర్మవరంలో కూలి పనులతో జీవనం సాగించేవారు. రవి నాయక్ తాగుడుకు బానిస కావడంతో భాగ్యబాయి 20 రోజుల క్రితం అనంతపురం లోని ఓబులదేవర నగర్‌లో మకాం మారి అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఆమెతో పాటు కొడుకు, కుమార్తె ఉన్నారు. రెండు రోజుల క్రితం భాగ్యబాయి వద్దకు వచ్చిన రవినాయక్.. సోమవారం మద్యం సేవించి భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో కత్తి తీసుకుని భాగ్య బాయి గొంతు కోసి పరారయ్యాడు. పొరుగింటి వారు తక్షణమే స్పందించి ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం భాగ్య బాయి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

'యానిమేటర్ రూ.29 లక్షలు స్వాహా చేశారు'



మాట్లాడుతున్న డ్వాక్రా మహిళలు

అనంతపురం అర్బన్: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన డ్వాక్రా యానిమేటర్ 30 పొదుపు సంఘాలకు సంబంధించిన రూ.29 లక్షలు స్వాహా చేసిందని సంఘాల లీడర్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘాల లీడర్లు రాధ, వీణప్రియ, స్వాతి, కృష్ణవేణి, మీనాక్షి, లలిత, అనురాధ మాట్లాడారు. ఈ విషయంపై డీఆర్‌డీఏ అధికారులకు మూడు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. డీఆర్‌డీఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా సంఘాల పద్దులను రీ-ఆడిట్ చేయించాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



గాయపడిన గోవిందరెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రామగిరి మండలం కలికివాండ్లపల్లికి చెందిన గోవిందరెడ్డి, ధర్మవరం మండలం ముచ్చురామికి చెందిన రామాంజి ద్విచక్ర వాహనంలో ఎన్ఎస్ గేట్ నుంచి చెన్నేకొత్తపల్లికి బయలుదేరారు. చెన్నేకొత్తపల్లి వై జంక్షన్ వద్ద బెంగళూరు వైపు నుంచి వెళుతున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవిందరెడ్డి, రామాంజి గాయపడటంతో స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

'బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం సరికాదు'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం అర్బన్: తపోవనానికి వెళ్లే దారిలో రిషిత స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మించాలంటూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బ్రిడ్జి సమీపంలో సోమవారం రిలేదీక్షలు చేపట్టారు. సీపీఎం నాయకుడు రాజు అధ్యక్షతన చేపట్టిన దీక్షలకు నల్లప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాడైన బ్రిడ్జి స్థానంలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణంలో నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్య వైఖరి సరికాదన్నారు. నగరాభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న పాలకులు బ్రిడ్జి నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. తిక్కరంగయ్య స్వామి గుడి నుంచి తపోవనం పోయే దారి పూర్తిగా పాడయ్యినా మరమ్మతు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. రిలేదీక్షలకు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు నాగరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, రంగంపేట గోపాల్‌రెడ్డి తదితరులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి సీపీఎం నాయకులు వెంకట నారాయణ, ప్రకాష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం



ఫ్లోరోసిస్‌పై సూచనలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఫ్లోరోసిస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సీడీ పీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణ స్వామి, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా ఫ్లోరోసిస్ బాధితులకు చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు అందజేశామన్నారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, క్షేత్రస్థాయికి వెళ్లి ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించాలన్నారు. బాధితులను గుర్తించి వైద్యం అందించాలని సూచించారు. అంతేకాకుండా క్షేత్ర స్థాయిలో వెళ్లినప్పుడు మల్టీ విటమిన్ మాత్రలతో పాటు ఆరోగ్య ఆహారపు అలవాట్ల గురించి తెలియజేయాలన్నారు. వాటర్ శాంపిల్స్ చేసిన అనంతరం అవసరం ఉన్న వారికి పునరావాస పరికరాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ తేజశ్విని, ఏఎన్ఎం లక్ష్మి, తిరుపాలమ్మ, ఆశా వర్కర్లు నాగరత్న, శివలింగమ్మ పాల్గొన్నారు.

డీల్ కుదరలేదప్పా..



- డైట్ కాంట్రాక్ట్ కోసం జూన్‌లో టెండర్ల ఆహ్వానం
- అమ్యామ్యాల కోసం ఎదురుచూస్తున్న అధికారులు
- నేటికీ కాంట్రాక్ట్ కేటాయించని వైనం
- ఆకలితో అలమటిస్తున్న రోగులు
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగుల ఆకలి తీర్చే డైట్ కాంట్రాక్ట్ డీల్ కుదరక పోవడంతో డైట్ కాంట్రాక్ట్ కేటాయింపు తీవ్ర జాప్యం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోగులకందించే టిఫిన్, భోజనం, అల్పాహారం, తదితర వాటిని అందించేందుకు సర్వజనాస్పత్రిలో రెండేళ్లకు ఒకసారి డైట్ కాంట్రాక్ట్ టెండర్లను ఆహ్వానిస్తారు. ఈ ఏడాదిలో జూన్‌లో కాంట్రాక్ట్‌కు సంబంధించి సర్వజనాస్పత్రి అధికారులు టెండర్లను ఆహ్వానించారు.

ముగ్గురు ఒకే కోట్ నమోదు..

డైట్ కాంట్రాక్ట్‌కు సంబంధించి ఆస్పత్రిలో ఐదుగురు టెండర్‌లో పాల్గొన్నారు. అందులో ఇద్దరిపై వివిధ లోపాలను చూపుతూ అధికారులు అనర్హత వేటు వేశారు. రోజుకు ఒకరికి మూడు పూటల డైట్ అందించేందుకు ప్రభుత్వం రూ.80 ధర నిర్ణయించగా, ముగ్గురు కాంట్రాక్టర్లు రూ.72 నమోదు చేస్తూ టెండర్లు వేశారు. ఈ క్రమంలో ముగ్గురు కాంట్రాక్టర్లు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. తమకే కాంట్రాక్ట్ కావాలంటూ పోటీపడుతున్నారు. వాస్తవంగా సర్వజనాస్పత్రికి రోజూ 2,500 మంది ఓపీ, 1,100 మంది ఔట్ పేషంట్లు వస్తుంటారు. గతంలో సదరు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నెలకు రూ.15 లక్షల వరకు చెల్లించేది. కాగా ఇంత పెద్ద భారీ కాంట్రాక్ట్ కేటాయింపు విషయంలో అధికారులు, సదరు కాంట్రాక్టర్ల మధ్య డీల్ కుదరకపోవడంతదో తీవ్ర జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డైట్ కాంట్రాక్ట్ ఫైల్‌ను జిల్లా ఉన్నతాధికారుల వద్ద ఉంచామని.. అక్కడి నుంచి అనుమతులు రాగానే డైట్ కాంట్రాక్ట్‌ను అందిస్తామని సదరు అధికారులు చెబుతున్నారు.

రోగుల ఆరోగ్యంపై ప్రభావం

వాస్తవంగా సర్వజనాస్పత్రిలో డైట్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఇప్పటికీ ఆస్పత్రిలోని వెనుకవైపు ఎటువంటి సురక్షిత ప్రమాణాలు పాటించని చోట డైట్ నిర్వహిస్తున్నారు. దీంతో రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు కొత్తగా ఇచ్చే డైట్ కాంట్రాక్టర్ సరైన సురక్షిత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉంది. రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా జిల్లా అధికార యంత్రాంగం కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది. డైట్ కేటాయింపు విషయంలోనే అధికారులు అమ్యామ్యాల కోసం ఎదురు చూస్తుంటే ఇక వచ్చే వారు రోగులకు ఎంతటి నాణ్యమైన భోజనం అందిస్తారో అర్థం కాని పరిస్థితి.



ఆస్పత్రిలో డైట్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

వినాయక ఉత్సవాలకు అంకురార్పణ

అనంతపురం కల్చరల్: స్థానిక సప్తగిరి సర్కిల్‌లో ఐదు రోజుల పాటూ వైభవోపేతంగా సాగనున్న వినాయక చవితి ఉత్సవాలకు మేయర్ వసీం సోమవారం భూమిపూజ చేసి, శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీగణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగే వినాయక చవితి ఉత్సవాలు ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా సాగిపోవాలన్నారు. సమితి ప్రతినిధి పరుచూరు రమేష్ మాట్లాడుతూ విద్యుత్ కదలికలతో ఏటా వినాయక వృత్తాంతాన్ని వివరిస్తూ ఘనంగా ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈసారి కర్ణాటకలోని కారణగిరి సిద్ధి క్షేత్ర మహాత్మ్యాన్ని తెలియజేసేలా సీతాన్వేషణ వృత్తాంతంతో వేడుకలు నిర్వహిస్తామన్నారు. ముందు వైపు ప్రధాన గోపుర ద్వారం ఢిల్లీలోని అక్షరధామ్ నమూనాతో ఉంటుందని వెల్లడించారు. ఈనెల 27 నుంచి 31 వరకు ఉత్సవాలు సాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కరరెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రమోద్ స్వామి, నాగన్న, వేణుగోపాల్, శ్రీనివాసులు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మేయర్ వసీం

'సూపర్ సిక్స్' సాధనకు పోరుబాట

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, ఈ క్రమంలో సూపర్ సిక్స్ హామీల సాధనకు పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన సోమవారం జిల్లా సమితి సమావేశం జరిగింది. నారాయణస్వామితో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిదన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పౌరుల ప్రాథమిక హక్కులను, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకూ ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందించి ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధమవుతామన్నారు. అనంతరం మహాసభల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, నాయకులు కేశవరెడ్డి, రామకృష్ణ, నారాయణస్వామి, గోపాల్, పద్మావతి, లింగమయ్య, గోవిందు, రమణ, అల్లీపీరా, కృష్ణుడు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

మణికంఠ అక్రమాలపై విచారణ చేయాలి

అనంతపురం అర్బన్: స్థానిక చెరువుకట్టపై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని ఆలయ ప్రక్షాళన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను కలసి వినతిపత్రం అందజేశారు. కమిటీ సభ్యులు రంగాచారి, కృష్ణకుమార్, మణికంఠ బాబు, రవి, తదితరులు మాట్లాడారు. ఆలయ కమిటీని 30 ఏళ్లగా ఒకే కుటుంబం ఆధీనంలో ఉంచుకున్నారన్నారు. మణికంఠ అధ్యక్షుడిగా కొనసాగుతూ అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. శాశ్వత సభ్యులు, అయ్యప్ప స్వామి భక్తులతో సంప్రదించకుండా సర్వసభ్య సమావేశాలు నిర్వహించకుండా, ఆలయ ఆదాయం, ఖర్చుల వివరాలు తెలియజేయడం లేదన్నారు. అవినీతిని ప్రశ్నించిన భక్తులను భయపెడుతున్నారని ఆరోపించారు. అయ్యప్ప భక్తులు, హిందూ బంధువుల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గం ఎన్నిక జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రక్షాళన కమిటీ సభ్యులు రవి, ప్రసాద్, గోపాల్, శ్రీనివాసులు, రమణ, అమర్‌నాథ్, శ్రీకాంత్, కేశవ, సూర్యనారాయణ, రమేష్, సుబ్బారెడ్డి, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు సమస్యలు చెబుతున్న కమిటీ సభ్యులు

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

అనంతపురం అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసాని నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గద్దల నాగభూషణం, చిందనూరు నాగరాజు మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని 2014 ఎన్నికల సమయంలోనే హామీ ఇచ్చి అధికారంలోకి ఇచ్చిన తరువాత అమలు చేయకపోవడంతో బీసీలకు అప్పట్లోనూ తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నందున అప్పట్లో ఇచ్చిన హామీని ఇప్పుడు కచ్చితంగా అమలు చేయాలని కోరారు. కులగణనతో సంబంధం లేకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి అంకె కుళ్లాయప్ప, నాయకులు శ్రీనివాసులు, అనిల్ కుమార్, పోతులయ్య, రమేష్, ఓబుళేసు, గంగాధర్, నాగరత్న, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల్లో టెన్షన్

- రీవెరిఫికేషన్ పేరుతో 130 మందికి నోటీసులు
- లబోదిబోమంటున్న దివ్యాంగులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం పింఛన్ల తొలగింపునకు కుట్రలు పన్నుతోంది. రీవెరిఫికేషన్ పేరుతో మండల వ్యాప్తంగా 130 మంది దివ్యాంగులకు నోటీసులు జారీ చేసింది. ఆందోళనకు గురైన లబ్ధిదారులు సోమవారం సచివాలయాలకు పరుగులు తీశారు. తమకు ఇక పింఛన్ రాదా? అంటూ ఆందోళనకు గురవుతున్నారు. నోటీసులు అందుకున్న వారు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ దగ్గర పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ ఇచ్చిన ధ్రువపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని అధికారులు చెబుతున్నారు. డాక్టర్ దగ్గర తీసుకువచ్చిన ధ్రువపత్రం, నోటీసును ఎంపీడీఓ సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్‌లోడ్ చేసిన తరువాత వారికి కేటాయించిన తేదీల్లో మళ్లీ డాక్టర్ దగ్గరకి వెళ్తే పరీక్షించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతా నెల రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 130 మందికి రీవెరిఫికేషన్‌కు నోటీసులు వచ్చినట్లు తెలియజేశారు. నోటీసులు వచ్చిన వారికి రాబోవు నెల పింఛన్ వచ్చే అవకాశం ఉండదని అధికారులు తెలియజేశారు.



భక్తులతో శివాలయాలు కిటకిట

అనంతపురం కల్చరల్: పవిత్ర శ్రావణ మాసంలో వచ్చిన చివరి సోమవారం కావడంతో నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొదటి రోడ్డు శివాలయం, శివకోటి, శంకర మఠం తదితర చోట్ల మహాశివుడికి ఏకవార రుద్రాభిషేకాలు, రుద్రం చమకం పఠనం, అలంకార సేవలు జరిగాయి. శివబాలయోగి ఆశ్రమంలో తెల్లవారుజాము నుంచే శ్రావణ సోమవారం విశేష పూజలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం వరకు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కమిటీ సభ్యులు అరవింద్, విశ్వనాథ్, దేవరాజ్ తదితరులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



అలంకరణలో అనంతేశ్వరి మాత

బెస్తలకు న్యాయం చేయండి

రాప్తాడు: బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని పట్టపు కులానికి కేటాయించడం దుర్మార్గమని బెస్త సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శివశంకర్ మండపడ్డారు. పట్టపు కులానికి కేటాయించిన బెస్త కార్పొరేషన్ చెర్మన్ పదవిని రద్దు చేసి బెస్త కులస్తులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ విజయకుమారికి బెస్త సేవా సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆంధ్ర ప్రదేశ్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ (ఆఫ్ కాఫ్) చెర్మన్ పదవిని చట్ట విరుద్ధంగా కొల్లు పెద్దిరాజుకు కేటాయించిందన్నారు. బెస్త కులస్తులను ఓటు బ్యాంకుగా వాడుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో బెస్త సేవా సంఘం నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు బెస్త భాస్కర్, బెస్త రాజేష్, బెస్త శ్రీరాములు, బెస్త మురళి తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ స్పెషాలిటీ'లో ఇష్టారాజ్యం



అల్ట్రాసౌండ్ స్కాన్ గదికి తాళాలు వేసిన దృశ్యం

నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని అల్ట్రాసౌండ్ స్కాన్ గదికి సోమవారం పట్టపగలే తాళాలు వేశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించడంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీని అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే కూటమి ప్రభుత్వంలో వైద్యులు, పీజీ విద్యార్థులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిపోయింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన వైద్యులు.. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. సూపరింటెండెంట్ అప్పుడప్పుడూ కాస్త వార్డులను తనిఖీ చేస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

– అనంతపురం మెడికల్:

21న పంపనూరులో వేలం పాట

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజా సామగ్రి విక్రయ హక్కులకు ఈనెల 21వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

అదనపు కార్యదర్శిని కలిసిన కలెక్టర్

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా పర్యటనకు విచ్చేసిన గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టీకే అనిల్ కుమార్‌కు కలెక్టర్ వినోద్ కుమార్ ఘన స్వాగతం పలికారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బుక్కరాయ సముద్రం వెళ్లారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, అసిసెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పాల్గొన్నారు.



అదనపు కార్యదర్శి అనిల్ కుమార్‌కు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్

పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం టవర్‌క్లాక్: విజయవాడలో ఈనెల 30న జరిగే సంచార-అర్ధసంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సంచార జాతులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. సంచార జాతులకు కులం వర్తింపజేసి, వారిని ఒక చోట కలపడానికి విజయవాడలో సంచార జాతుల విముక్తి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవిరెడ్డి, దుద్దకుంట వెంకటేశ్వర రెడ్డి, లలిత్ కుమార్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు



రైతులతో సమావేశమైన ఏఓ, ఆత్మా సిబ్బంది

కనగానపల్లి: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని ఏఓ మాధురి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆత్మా, వ్యవసాయ సిబ్బందితో కలసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్‌ఎస్‌కేలో రైతులతో సమావేశమై ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగులో మెలకువలు, చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంటల సాగు కోసం ఎక్కువగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడితే పెట్టుబడులు పెరుగుతాయన్నారు. సేంద్రియ పద్ధతులతో పంటలు సాగు చేస్తే పెట్టుబడి తగ్గి మంచి దిగుబడులు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆత్మా కో-ఆర్డినేటర్ ప్రబంధ, వీహెచ్ఏ రమ్యకృష్ణ, ఎంపీఈఓ జయరాం పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితం చిత్తు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వి.రాజశేఖర్

అనంతపురం మెడికల్: ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం చిత్తు అవుతుంది. ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకమైన వాతావరణంలో విద్యను అభ్యసించాలని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి. రాజశేఖర్ పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ వీక్‌కు సంబంధించి సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని.. అందులో ఉత్తమ వైద్యులుగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలను ఎదుర్కొవాల్సి వస్తుందని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శంకర్, డాక్టర్ మధుసూదన్, వైద్యులు డాక్టర్ సరళ, డాక్టర్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా ప్రజాప్రతినిధులకు శిక్షణ

అనంతపురం సిటీ: స్థానిక జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో ఉమ్మడి జిల్లాలోని మహిళా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు మంగళవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు డీపీఆర్‌సీ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ నిర్మల్ సోమవారం తెలిపారు. 'మార్పు ద్వారా విజేతలు-మహిళా సాధికారతతో స్వపరిపాలన సాధ్యం' అనే అంశంపై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అతిథిగా హాజరై శిక్షణ తరగతులను లాంఛనంగా ప్రారంభిస్తారని వెల్లడించారు.